




# మన భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

శనివారం 6 జూన్ 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 3







## సూర్యాపేట మున్సిపాలిటీకి 'ఉత్తమ పర్యావరణ పనితీరు' పురస్కారం

**-మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా అవార్డు అందుకున్న చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి, కమిషనర్ హన్మంత రెడ్డి.**

భానుపురి /హైదరాబాద్

వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణలో విశేష కృషి చేస్తున్న సూర్యాపేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ప్రదానం చేసే ఉత్తమ పర్యావరణ పనితీరు పురస్కారం'కు సూర్యాపేట మున్సిపాలిటీ ఎంపికైంది. ఈ పురస్కారాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని టీజీపీసీబీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో దేవాదాయ, అటవీ శాఖ, ఎన్విరాన్ మెంట్ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి లులి అందుకున్నారు. పట్టణంలో వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగం, పారిశుధ్య కార్యక్రమాల అమలు, పర్యావరణ పరిరక్షణ చర్యల్లో సూర్యాపేట మున్సిపాలిటీ కనబరిచిన ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని రీసైక్లింగ్ చేయడం, పర్యావరణ రహిత కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా అమలు చేయడం మున్సిపాలిటీకి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటీకి లభించిన ఈ పురస్కారం పట్టణ ప్రజలు, పారిశుధ్య కార్మికులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషికి నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో కూడా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి సూర్యాపేటను రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణలో సూర్యాపేట అమలు చేస్తున్న వినూత్న విధానాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు చర్యలు కొనసాగిస్తామని చెప్పారు. ఈ అవార్డుతో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రంలో పర్యావరణహిత పట్టణాల జాబితాలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది.









## ప్రభుత్వం పెంచిన మార్కెట్ విలువను వెంటనే విరమించుకోవాలి

భానుపురి /సూర్యాపేట టౌన్



రాష్ట్ర ప్రభుత్వం భూముల మార్కెట్ విలువ పెంచాలనే ఆలోచనను వెంటనే విరమించుకోవాలి. అని తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షుడు పంతంగి వీరస్వామి గౌడ్. రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుండి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజిస్ట్రేషన్ మార్కెట్ వ్యాల్యూ చార్జీలను గత ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు. తిరిగి నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచితే సామాన్య ప్రజలకు ఇబ్బందిగా మారే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలు కానుందని వివరించారు. మార్కెట్ విలువలు పెరగడం వల్ల సామాన్య ప్రజలకు బిల్డింగ్ పర్మిషన్ తో పాటు ఎల్ ఆర్ ఎస్ కు విపరీతంగా డబ్బులు ఖర్చు అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ రేట్లు పెంచడంతో సామాన్య ప్రజలు కనీసం ఇంటిని నిర్మించుకునే పరిస్థితిలో ఉండలేరని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న చార్జీలని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ భూముల మార్కెట్ వ్యాల్యూ పెంచితే రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ తగ్గించాలి. 3% పర్సెంట్ చేయాలి. గతంలో ఎల్ అర్ ఎస్ కోసం ఆన్లైన్లో 10000 రూపాయలు చెల్లించిన వారికి మున్సిపాలిటీ అధికారులు ఆప్షన్ తీసుకోవట్లేదు అని చెబుతున్నారు. అవి కూడా ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ లేకుండా రెగ్యులర్ చేసేటట్టు ప్రభుత్వం అమలు చేయాలి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్ కొరకు వెయ్యి రూపాయలు కట్టినవే అమలు చేస్తున్నారు. పదవేల రూపాయలు కట్టినవి అమలు చేయట్లేదని అన్నారు. 142 సబ్ రిజిస్టర్ ఆఫీసులు ఉన్నవి ఒక పది మాత్రమే సుమారు సొంత భవనాలు ఉన్నవి మిగతా అన్ని అద్దె భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి వాటన్నిటిని కూడా పరిశీలించి కొత్త భవనాలు స్థలాలు కేటాయించి నిధులు మంజూరు చేసి సబ్ రిజిస్టర్ కార్యాలయలు ఏర్పాటు చేసి సిబ్బంది కొరత లేకుండా ప్రభుత్వం చూడాలి అని వీరస్వామి గౌడ్ చెప్పుకొచ్చారు. సూర్యాపేటలో కృష్ణ కాలనీలో గత 20 సంవత్సరాల క్రితమే సబ్ రిజిస్టర్ కార్యాలయానికి ఎనిమిది గుంటల స్థలం భూమి యజమానులు సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుకు రిజిస్ట్రేషన్ చేశారు. కావున దానికి నిధులు కేటాయించాలని సూర్యాపేట జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు. కొత్త భవనాలు ఏర్పాటు చేయాలి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షుడు జలగం సత్యం గౌడ్, రియల్ ఎస్టేట్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దేవత్ కిషన్ నాయక్. రాష్ట్ర కోశాధికారి పాల సైదులు, రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ బొమ్మగాని శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి అమరవాది శ్రావణ్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కంభంపాటి అంజయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్న శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట జిల్లా గౌరవ సలహాదారుడు మాదిరెడ్డి గోపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అయితేగాని మల్లయ్య గౌడ్, ఆకుల మారయ్య గౌడ్, పట్టణ కార్యదర్శి గిరీశం, పట్టణ ఉపాధ్యక్షుడు బానోతు జానీ నాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకన్న, పట్టణ ఉపాధ్యక్షుడు పట్టేటీ కిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడి లింగయ్య కిషోర్ కుమార్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



భానుపురి /సూర్యాపేట టౌన్

తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తం కుమార్ రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి శాసన మండలి సభ్యులు కేతవత్ శంకర్ నాయక్ సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్‌ఎఫ్) చెక్కును ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి లబ్ధిదారునికి అందజేశారు.ఈ సందర్భంగా ఆత్మకూర్ (ఎస్) మండలం, తుమ్మల పెన్ పహాడ్ గ్రామానికి చెందిన వరికుప్పల లక్ష్మమ్మ (భర్త: మల్లయ్య) గారికి మంజూరైన రూ.39,500/- (ముప్పై తొమ్మిది వేల ఐదు వందల రూపాయలు) విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.

# పుల్లారెడ్డి చెరువును పునరుద్ధరించాలి

భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న పాదయాత్రలో భాగంగా శుక్రవారం సిపిఐ(ఎం.ఎల్ ) మాస్ లైన్ నాయకులు సూర్యాపేట పట్టణంలోని కొత్తగూడ బజార్ పుల్లారెడ్డి చెరువును పరిశీలించటం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ(ఎం.ఎల్ )మాస్ లైన్ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ కొత్తపల్లి రేణుక మాట్లాడుతూ ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో జలకళ సంతరించుకున్న పుల్లారెడ్డి చెరువు నేడు పూడికతో నిండిపోయి, వ్యర్థ పదార్థాల విష జలాలను తన కడుపులో నింపుకొని, సూర్యాపేట పట్టణ ప్రజలకు జల,వాయు కాలుష్యాలను అందిస్తున్న చెరువుగా మారిపోయిందని అన్నారు. 12 అడుగుల పూడిక పేరుకు పోయి, గుర్రపు డెక్క ఆకులతో నిండి ఈగలు, దోమలు,పందులకు నివాసం అయ్యింది అన్నారు. చెరువులో వ్యర్థ పదార్థాలు విపరీతంగా పేరుకుపోవడంతో నీరు మొత్తం కలుషితమై, భూగర్భ జలాలు విషతుల్యమైనయని, ఆ నీరును ఉపయోగించి పండించిన పంటలు విషపదార్థాలుగా తయారవుతున్నాయని ఆమె ఆవేదన చెందారు. ఒకనాడు మంచినీటి చెరువుగ విరాజిల్లిన ఈ చెరువు నేడు కంపు వాసనతో దుర్గంధపూరితంగా తయారై వాయు కాలుష్యాన్ని వెదజల్లుతూ ప్రజలను అనారోగ్యానికి గురి చేస్తుందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ చెరువు మిషన్ కాకతీయ పథకం కింద పునరుద్ధరణకు నిధులు మంజూరైనప్పటికీ, పనులలో ఏ మాత్రం పురోగతి లేదని ఆమె అన్నారు. నిధుల దుర్వినియోగంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నిజ నిర్ధారణ చేసి దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినారు. చెరువులో పేరుకుపోయిన పూడికను తీయించి, గుర్రపు డెక్క ఆకులను తొలగించి, చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములలో పిల్లల కొరకు పార్కులు నిర్మించాలని ఆమె ప్రభుత్వానికి సూచించారు. చెరువు పునరుద్ధరణలో ఎదురవుతున్న అన్ని రకాల ఆటంకాలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసినారు. చెరువులోకి వచ్చే వ్యర్థ పదార్థాలను ప్రత్యేక రీసైక్లింగ్ సిస్టం ద్వారా తొలగించి, శుద్ధి అయిన నీరుని చెరువులోకి వదిలి వ్యవసాయానికి ఉపయోగించాలని అన్నారు. వ్యర్థ పదార్థాల నిల్వ కొరకు ప్రత్యేక డంపును తయారు చేయాలని ఆమె సూచించారు. అన్ని విధాలుగా పుల్లారెడ్డి చెరువును పునరుద్ధరించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని ఎడల రాబోయే రోజులలో అన్ని ప్రజా సంఘాలతో ఐక్య ఉద్యమాలు నిర్మించి చెరువులను కాపాడుకుంటామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఎర్ర అఖిల్ కుమార్, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపికేఎంఎస్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ పేర్ల నాగయ్య, పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ, జిల్లా సహాయ కార్యదర్శి ఒంటికొమ్ము సంతోషి మాత, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు భీమనపల్లి ప్రకాష్, గుండాల శివ తదితరులు పాల్గొన్నారు.





# హక్కుదారులం మేమే

-ఎవరికి రిజిస్ట్రేషన్ చేయలేదు



భానుపురి /సూర్యాపేట టౌన్

అంజనపురి కాలనీ సమీపంలో వజ్ర టౌన్ షిప్ లో ఉన్న భూమి లో మా తండ్రి నుంచి వచ్చిన భూమిలో 50 ఏళ్లుగా హక్కు దారుల మేమే ఎవరికి రిజిస్ట్రేషన్ చేయలేదని 478,479, 480 సర్వే నెంబర్లలో 48 గజాలు మాత్రమే విక్రయించామని నల్లు చిత్తరంజన్ రెడ్డి, నల్లు ఉమా జ్యోతి, అన్నారు. సబ్ రిజిస్ట్రేషన్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 12 ఎకరాలు కలిగి ఉన్నామని కొంతమేరకే విక్రయించామని కొందరు కావాలని ఆరోపిస్తున్నారని ఎవరికీ రిజిస్ట్రేషన్ చేయలేదని సేల్స్ అగ్రిమెంట్ కూడా చేయలేదని అక్రమ రిజిస్ట్రేషన్ అని ఉసిగొలుతున్నారని విమర్శించారు. ఆరోపిస్తున్న సదరు వ్యక్తి పై అనేక కేసులు నమోదయి ఉన్నాయని పేదల భూములు అక్రమంగా ఆక్రమించాడని ఆరోపించారు. అరాచకం దౌర్జన్యం చేస్తే ఏమాత్రం తగ్గే ప్రసక్తి లేదని హెచ్చరించారు. క్లియర్ కట్ గా ఇసీ తీస్తే కూడా మా భూమి డీటెయిల్స్ ఉంటాయని తెలిపారు. వారి వెంట పలువురు ఉన్నారు.

## కోదాడ పట్టణంలో మారుతి స్పోర్ట్స్ షాప్‌ను ప్రారంభించిన పిల్లుట్ల రఘు

భానుపురి / కోదాడ:-



కోదాడ పట్టణంలోని మారుతి స్పోర్ట్స్ షాప్‌ను బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిల్లుట్ల రఘు ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్ యాజమాన్యం మరియు అభిమానులు రఘు కు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ, కొత్తగా ప్రారంభమైన మారుతి స్పోర్ట్స్ షాప్ విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ మారుతి స్పోర్ట్స్ షాప్ యాజమాన్యం వారు పిల్లుట్ల రఘు మరియు భూక్యా కృష్ణ, ఆంజనేయులు, రెడ్య నాయక్ ను శాలువ తో సత్కరించారు ఈ కార్యక్రమంలో భూక్యా రవి నాయక్ ఎర్రగుంట తండా సర్పంచ్, పద్య బాలాజీ, గుగులోతు కృష్ణ, షేక్ బాజీ, కొండా తదితరులు పాల్గొన్నారు.

## మొక్క నాటితేనే భవిష్యత్తుకు భరోసా

భానుపురి /,నేరేడుచర్ల:

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నేడుచర్లలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఉత్సాహంగానిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బట్టు మధు నేతృత్వంలో పాఠశాల ఎకో క్లబ్ మరియు యంగ్ ఎర్త్ లీడర్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలలోని 'మదర్ ట్రీ' వద్ద పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేసి ప్రకృతి సంరక్షణకు తమ కట్టుబాటునుచాటుకున్నారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కనీసం ఐదు మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని అన్నారు. నీటి వృథాను అరికట్టడం, చెత్తాచెదారాన్ని వేరు చేసి రీసైక్లింగ్ ద్వారా తిరిగి వినియోగించడం, ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావచ్చని సూచించారు.ప్రయాణాల సమయంలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లకు బదులుగా స్టీల్ బాటిళ్లను ఉపయోగించాలని, పెట్రోలు, విద్యుత్ వంటి ఇంధన వనరులను పొదుపుగా వినియోగించాలని ఆయన సూచించారు. అలాగే వారంలో కనీసం ఒకరోజు సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా విద్యుత్ ఆదా కావడంతో పాటు పర్యావరణంపై ఒత్తిడి కూడా తగ్గుతుందని వివరించారు.పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ఒకరోజు కార్యక్రమం కాదని, అది ప్రతి రోజు పాటించాల్సిన జీవన విధానమని ఆయన విద్యార్థులకు సూచించారు. చిన్న చిన్న మార్పులు పెద్ద ఫలితాలను తీసుకువస్తాయని, పర్యావరణ హిత అలవాట్లు అలవరచుకోవడం ద్వారా భూమిని మరింత సురక్షితంగా ఉంచవచ్చనితెలిపారు.విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటడంతో పాటుపర్యావరణపరిరక్షణపైఅవగాహనపెంపొందించుకున్నారు. ఈ కార్యక్రమం పాఠశాలలో పర్యావరణ చైతన్యాన్ని మరింత బలోపేతం చేసింది.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యుడు చిలకరాజు శ్రీను, ఉపాధ్యాయులు ఎన్. నరసింహారావు, ఎం. యాదగిరి, వి. శ్రీనివాసరావు, చంద్రశేఖర్ రెడ్డి, గురునాథం, వెంకటేశ్వర్లు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ రిజిస్ట్రేషన్ ను అడ్డుకుంటాం





భానుపురి/ సూర్యాపేట టౌన్

సూర్యాపేట పట్టణంలోని అంజనపురీ కాలనీ నందు గల వజ్ర టౌన్ షిప్ లో బలహీన వర్గాలు, ఉద్యోగులు, వ్యాపారస్తులు తాము కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసిన ఇళ్ళను అక్రమంగా వేరొకరికి రిజిస్ట్రేషన్ చేస్తున్నారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం వజ్ర టౌన్ షిప్ లో ప్లాట్ల యజమాని మరొకసారి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు నల్లు ఉమా జ్యోతి రెడ్డి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వస్తున్నారని, ఈ నేపథ్యంలో ఆ రిజిస్ట్రేషన్ ను అడ్డుకునేందుకు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించిన వారితో కలిసి కార్యాలయం వచ్చారు. ఈ క్రమంలో ఇది లా అండ్ ఆర్డర్ కు భంగం కలిగించేలా ఉందని పట్టణ సిఐ వెంకటయ్య వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా వట్టే జానయ్య యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ..... మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిల ప్రోత్సాహంతోనే అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, గతంలో రూరల్ పోలీస్ స్టేషన్ లో అక్రమ రిజిస్ట్రేషన్ పై కేసులు నమోదు చేశామని, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదనన్నారు. అగ్రకులాల పార్టీ నాయకులు అక్రమ రిజిస్ట్రేషన్ ను అధికారులు, పోలీసుల అండతో ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఈతంగానికి పూనుకోవటం హేయమైన చర్య అన్నారు. శుక్రవారం (ఈరోజు) మరోసారి తప్పుడు కాగితాలతో మరొకరికి చేసేందుకు వస్తే పట్టణ పోలీసులు తమపై దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో చట్టబద్ధంగా అనుమతులు తీసుకుని నిర్మాణ పనులు చేపడుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజలను కొందరు కావాలనే ఇబ్బందులకు గురిచేశారని, నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న ఇనుప సామగ్రి, రాడ్లు వంచే యంత్రాలను మున్సిపల్ సిబ్బందితో బలవంతంగా తీసుకెళ్లారని ఆరోపించారు. ఈ విషయంలో సూర్యాపేట రూరల్ పోలీసులు సివిల్‌కు సంబంధించిన వ్యవహారాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దు. ఇదే విధంగా వ్యవహరిస్తే తదుపరి పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. పేదలు, భాదితులు పక్షాన పోలీసులు నిలవాలన్నారు. బలహీనవర్గాలు ఇల్లు నిర్మాణం చేపట్ట వద్దా, రాజకీయంగా ఎదగొద్దా మీడియా వాళ్ల సమక్షంలో బహిరంగంగా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. తమ కష్టార్జితాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అధికార పార్టీ నేతలకు పోలీసులు కొమ్ము కాయడం సరికాదన్నారు. ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద జరుగుతున్న ఉద్రిక్తతల నడుమ పోలీసులు వట్టే జానయ్య యాదవ్ ను చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారు.

## అధిక జ్యేష్ఠ మాసం సందర్భంగా వాసవిమాత కు వాయినాలు






భానుపురి /సూర్యాపేట కల్చరల్

అధిక జ్యేష్ఠ మాసం సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం 33 శాల్తీలతో అనేక రకాల పండ్లు,ప్రసాదాలు వాయనాలు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వాసవి మాతకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పట్టు వస్త్రములు అలంకరింపజేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామూహిక లలితా సహస్ర నామ పారాయణ, శ్రీ విష్ణు సహస్ర నామ, శ్రీ వాసవి మాత పారాయణం, మణి ద్వీప వర్ణన లు పఠించారు. సూర్యాపేట పట్టణ ఆర్య సంఘం అధ్యక్షులు గా గెలుపొందిన బెలిదె శ్రీనివాసులు రాధా దంపతులను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. సుధాకర్ పివిసి ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సింగిరికొండ రవీందర్, ఈగ వెంకటేశ్వర్లు,తాళ్లపల్లి రామయ్య, గుండా శ్రీధర్, చల్లా లక్ష్మయ్య, బిక్కుమల్ల కృష్ణ , రాచకొండ శ్రీనివాస్, మిట్టపల్లి రమేష్, బెలిదె అంజయ్య, పసుపర్తి కృష్ణమూర్తి, దోగుపర్తి ప్రవీణ్, సోమ వెంకటేశ్వర్లు, సోమా ప్రవీణ్ కుమార్, జూలకంటి నాగరాజు, బజ్జూరి శ్రీనివాస్, వెంపటి శబరినాథ్, యామా సంతోష్, శ్రీరంగం రాము, లకుమరపు పద్మజ,తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణ కి గురి అయిన ప్రభుత్వ స్థలం ను కాపాడాలి

భానుపురి /హుజూర్నగర్

సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ లో కోటి రూపాయల విలువ గల ఎన్ఎస్పి భూమిని కబ్జా చేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం నిలుపుదల చేయుట కు సర్వే నంబర్ లేని స్థలం లో తప్పుడు పేపర్ల తో ఆక్రమణ కి గురి అయిన ప్రభుత్వ స్థలం ను కాపాడాలి. సీతారాం నగర్ కి అనుకోని ఉన్న ప్రభుత్వ స్థలం అయిన ఎన్ ఎస్ పి స్థలం ను కబ్జా చేసి షాపింగు కాంప్లెక్స్ నిర్మాణం ఆపటం లో అధికారులు నిమ్మకు నీరు ఎత్తనట్లు ఉండటం విస్మరణీయం 3 సంవత్సరాల క్రితం ఎన్ ఎస్ పి కెనాల్ కి అనుకోని ఉన్న ప్రాంతంలో పేదల నిర్మించుకున్న గుడిసెలు తొలగించి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగింది. తిరిగి అదే ప్రాంతంలో కోటి రూపాయల విలువ గల స్థలంలో పట్టా లో లేని స్థలం లో ఇంటి నెంబర్ తో తప్పుడు పేపర్లను చూపి నిర్మాణం చేపడుతుంటే అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. ఎన్ఎస్పి అధికారులు నుండి ఆ స్థలం పూర్తిగా ఎన్ఎస్పి కి చెందినది అని దానిని కబ్జా చేసి నిర్మాణం చేయడం కి ఎటువంటి అనుమతులు లేవని మున్సిపల్ వారికి చెప్పి చేతులు దులుపు కోవడం, అధికారులు దీనిని పట్టించుకొక పోవడం దురదృష్టకరం. ఈ నిర్మాణాన్ని ఆపకపోవడం విస్మరయానికి గురిచేస్తుంది,అట్టి స్థలం ఎన్ఎస్పి వారిది తో పాటుగా నూతనంగా నిర్మించిన ఇన్నర్ రింగ్ రోడ్డు పక్కనే ఆనుకొని ఉండటంతో భారీ వాహనాలు వచ్చే సమయంలో మూలమలుపు మీద ప్రమాదాలు జరగడానికి కూడా ఎక్కువగా ఆస్కారం ఉన్నందున ప్రజలకు ప్రాణాపాయం కలిగే అవకాశం ఉన్నది అని కూడా ఫిర్యాదు లో పేర్కోవడం జరిగింది. పేదల గుడిసెలు తొలగించిన మీకు పెద్దల అక్రమ నిర్మాణం కనపడకపోవడం విస్మరణీయం. ఈ ఫిర్యాదు పత్రాన్ని ఎన్ ఎస్ పి డి ఈ కి, ఆర్ అండ్ బి, డి ఈ కి కూడా ఇవ్వడం జరిగింది

## మహిళా పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

-మాతృ వృక్షానికి ప్రతిజ్ఞ చేసిన మహిళలు

భానుపురి /పెన్ పహాడ్ :

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెన్ పహాడ్ మండలం అనంతారం గ్రామంలోని మహిళా పొదుపు సంఘం ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాతృ వృక్షం వద్ద సమావేశమై పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు.చెట్లను సంరక్షించడం, కొత్త మొక్కలను నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిశుభ్రమైన పరిసరాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మహిళలు పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలు మాతృ వృక్షం చుట్టూ నిలబడి పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతి సంపదను అందించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి, పర్యావరణ పరిరక్షణపై గ్రామ ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించింది.ఈ కార్యక్రమంలో మహిళా పొదుపు సంఘం సభ్యులు మామిడి వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ మామిడి రేవతి పరంధాములు , మామిడి అనిత, రాణి, రేణుక, సరిత, గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

